

# లిటిల్ రాస్కెల్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**నీరజకి** మనసంతా పచ్చిపుండులా వుంది. రవీంద్రభారతిలో తను స్టేజిమీదకు వెళ్ళినప్పుడు జరిగిన విషయాలన్నీ గుర్తుకువస్తున్న కొద్దీ అది కెలికినట్లవుతోంది. వద్దనుకున్నా ఎంత ప్రయత్నం చేసినా ఆ సంఘటనలు గుర్తుకు వస్తున్నాయి.

యూనివర్శిటీలో చెట్ల నీడకింద ఒంటరిగా కూర్చుని ఆలోచించసాగింది. ఆడిటోరియంలో వున్న వాళ్ళందరి దృష్టిలో తనో చవట. తన భర్త క్రితం సంవత్సరందాకా బ్రహ్మచారి అయినా ఏడేళ్ళ కొడుకున్నాడు. ఆ సంగతి తెలిసే తను అతడ్ని వివాహం చేసుకుంది. అతని కొడుకుని తను పెంచుతోంది.

"తనని, 'బ్రాడ్ మైండెడ్ లేడీ' అనుకునే వాళ్ళెవరూ వుండరు. తనో ఫూల్ అనీ, చవట అనీ, ఆత్మగౌరవం లేని వ్యక్తి అని, చీమూ నెత్తురు లేని మనిషినని అనుకుంటూంటారు ఇంటికెళ్ళినా అంతా భోజనాల ముందు తన గురించే ఎగతాళిగా మాట్లాడుకుని వుంటారు.

రాజేష్ గురించి కాదు, సాంబశివరావు గురించి కాదు. తన గురించే నవ్వుకుని వుంటారు.

ఎవరయినా తనని చూసి జాలిపడ్డా, సానుభూతి చూపించినా సహించని మనస్తత్వం కాదు తనది. అలా చేస్తే అగ్నిలో ఆజ్యం పోసినట్లు తనలో కోపం పొంగి పొర్లుతుంది.

"పాపం.. అమాయకురాలు ఈ కాలంలో ఇలాంటి వాళ్ళుండరు. రెడీమేడ్ కొడుకుని ఈమె సాకాలి" వాళ్ళనుకునే మాటలు వద్దనుకున్నా నీరజ మనసు ఆలోచిస్తోంది. ఆలోచించి, ఆలోచించి యింకా యింకా బాధ పడుతోంది.

తనకి ఎవ్వరిమీద కోపం వుందో తేల్చుకోలేకపోతోంది. కొడుకు గుణం దాచిన దశరథరామయ్య మీదా? సావిత్రి ద్వారా కొడుకుని కన్న సాంబశివరావు మీదా? రాజేష్ మీదా? ఆ ముగ్గురి మీదా?

ఆ కోపంలో ఎవరినో ఏదో చేసెయ్యాలి అన్న తీవ్రమైన కోరిక ఆమె మనసులో వుంది. అలా చేస్తేకానీ మనసు శాంతపడదు. ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలి? తనకు మనశ్శాంతి కలగాలంటే ఎవరిని ఏం చెయ్యాలి?

చాలాసేపు ఆమె కోసం వెతుకుతున్న ప్రొఫెసరి మేల్కోటే ఆమెని చూసి ఆగి అడిగాడు నవ్వుతూ "హలో ఏమిటిలా ఒంటరిగా?"

నీరజ మొహంలోని సీరియస్‌నెస్, బాధ చూశాక ఆయన నవ్వు ఆగిపోయింది.

"వాటీజ్ ది మాటర్ విత్ యు?" అడిగాడు ఓదార్పుగా.

నీరజ ఏడుపు బయటకి రాకుండా రెండు పెదవులని నొక్కిపట్టి, దాన్ని మింగింది. ఆయన సందేహించలేదు. ఆమె ప్రక్కనే కూర్చుని అడిగాడు. "పంచుకుంటే తీరేవి బాధలు. చెప్పుకుంటే తగ్గేవి వ్యధలు, ఏమిటి నీ సమస్య?"

నీరజకి తన అనే స్నేహితులెవరూ లేక అంతదాకా తనలో దాచుకున్న బాధని మొదటినుంచి ఆయనకి వివరించసాగింది. ఆయన సిగార్ అంటించి మౌనంగా వింటూండిపోయాడు. పూర్తిగా చెప్పాక ఆమెకి మనస్సులోని బరువు తగ్గినట్లయింది.

ఆయన కాసేపు మౌనంగా ఆలోచిస్తూండిపోయాడు. తర్వాత చెప్పాడు. "నీకున్న బాధలని ఎనలైజ్ చేద్దాం. ఒకటి, నీ భర్తకి మీ వివాహం ముందు ఎవరితోనో సంబంధం వుందని కదూ నీ బాధ? ఆ సంగతి నీ నుంచి దాచి మోసం చేసినందుకు నువ్వు అలాంటి మోసాన్ని భరించలేవు దానికి నువ్వు సమాధాన పడిపోయావు.. రెండోది, రాజేష్ అతన్ని దూరంగా పంపేయదలచుకున్నావు కాబట్టి అది తాత్కాలిక సమస్య. మూడోది నిన్న రాత్రి జరిగింది. నువ్వు మీ ఆయన 'మేడ్ ఫర్ ఈజ్ అదర్' అని అందరిముందు పొగడబడ్డ సంతోషం క్షణాల్లో తిరగబడి పోయింది. నీ గురించి అందరికి న్యూనతాభావం వుంటుందన్నదే యిప్పటి నీ బాధ. అది అర్థం చేసుకోగలను. నీ మనస్థత్వం, ఇతరులు నిన్ను చిన్న చూపు చూడకూడదు. నీ భర్త కొలీగ్స్ ముందు, ఆ సంగతి తెలిసిన ఎవరి ముందూ నువ్వు తలెత్తుకోలేవు. ఇంతేగా..?"

ఆగి చిన్నగా నవ్వి, మళ్ళీ చెప్పాడు. "నిన్న రాత్రి నేనూ రవీంద్రభారతిలో వున్నాను."

నీరజ ఉలిక్కిపడి తలెత్తి ఆయనవంక చూసింది.

"కానీ నువ్వు అనుకున్నట్లుగా రియాక్ట్ అవలేదు నేను. నీమీద జాలి కలగలేదు. నిజానికి గర్వంగా ఫీల్ అయ్యాను. నీలాంటి అమ్మాయి నాకు విద్యార్థిని అయినందుకు. రాజేష్ మీద కలగలేదు. ఆఫ్టరాల్ ఎంతో చిన్నవాడు, ఏమీ తెలియని పసివాడు. మీ ఆయనమీద కూడా కోపం కలగలేదు. తప్పు చెయ్యని మానవులెవరు ఈ లోకంలో? ఏదో ఓ విషయంలో జీవితంలో పెద్ద చిన్న తప్పులు చేస్తూనే వుంటాం. మనిషిలోని శాడిస్టిక్ టెంపరిమెంట్ సామూహికంగా వున్నప్పుడు ఎక్కువగా బయటపడుతూంటుంది. నిన్న థియేటర్లో అరిచి ఈలలు వేసి గొడవచేశారే, వాళ్ళముందు, కేవలం వాళ్ళముందే ఆ సంఘటన వ్యక్తిగతంగా, వంటరిగా జరిగి వుంటే అంత రియాక్ట్ అయేవారు కాదు."

"కానీ వాళ్ళంతా నన్ను..."

"చెప్పేది విను. నీ ఉద్దేశంలో వాళ్ళందరికీ కేవలం నీమీద సానుభూతి పడటం తప్ప వేరే పనిలేదనుకున్నావా? వాళ్ళకంటూ స్వంత జీవితాలు, స్వంత పనులు వుంటాయి. ఈ సంఘటన రెండు రోజులుపోతే గుర్తుండదు. కాలం ఇలాంటి వాటిని, వ్యక్తిగతంగా సన్నిహితం కాని యిలాంటి విషయాలని మరిపిస్తుంది. అసలు వ్యక్తిగతంగా సన్నిహితం అయితేనే మనుషులు చాలా సంగతులు గుర్తుంచుకోరు. పబ్లిక్ మెమో ఈజ్ వెరీ వెరీ షార్ట్, పబ్లిక్కి గుర్తుంచుకోవడం చాతకాదు. మళ్ళీ సంవత్సరం మీరిద్దరూ అదే ఫంక్షన్కి స్టేజ్ మీదకి ఎక్కితే పక్కవాళ్ళు గుర్తు చేస్తే తప్ప ఎవరికీ ఆ సంఘటన గుర్తువుండదు. అంతెందుకు? నిన్నటినుంచీ వద్దన్నా నీకు అదే పదే పదే గుర్తొస్తోందా? ఓ వారం, పదిరోజులు ఆగిచూడు. ఇంత తీవ్రంగా గుర్తురాదు. నెలదాటితే గుర్తొచ్చినా బాధ యింత తీవ్రంగా వుండదు. సంవత్సరంలోపే ఆ సంఘటన గుర్తువస్తే నవ్వుకునే స్తితికి చేరుకుంటావు. ఇది ప్రతీ మనిషి మనస్తత్వంలో నిక్షిప్తమై వుంటుంది."

ఆయన చెప్పేది వింటోంది నీరజ. తను ఎందుకిలా ఆలోచించలేదా అనిపించింది కొన్ని కొన్ని మాటలు వింటూంటే.

"ఓసారి ఇందిరాగాంధి పబ్లిక్ మీటింగ్లో మాట్లాడుతుంటే పండు టమోటాలు, పచ్చి కోడిగుడ్లు విసిరారు. ఎవరో విసిరిన రాయితో ఆవిడ ముక్కుకి గాయం అయింది కూడా. దాన్ని ఆవిడ అవమానంగా భావించివుండొచ్చు. కానీ ఆవిడకి

తెలుసు ప్రజలు దేన్నీ గుర్తుంచుకోరని. ఇప్పుడు ఇందిరాగాంధి పబ్లిక్ మీటింగ్‌కి వెళ్ళిన వాళ్ళలో ఈ విషయం తెలిసినా ఎందరికి ఈ సంఘటన గుర్తొస్తుంది.''

నీరజ మొహంలోని రిలీఫ్‌ని గుర్తించి చెప్పాడు సైకాలజీ ప్రొఫెసర్ మేల్‌కోటే.

''మనుష్యుల మధ్య వుండే బంధాలు, ముఖ్యంగా భార్యాభర్తల మధ్య వుండే సంబంధాలు, స్ట్రెయిన్ కాకూడదు. అయితే, వాటి తాలూకు మచ్చ చాలాకాలం వుంటుంది. నీ భర్తతో సరిగ్గా వుండు. ఆయన చేసిన కొత్త తప్పేంలేదుగా? రాజేష్ నీ ఇంట్లో వున్నంతకాలం ఆ కుర్రాణ్ణి నీ ప్రవర్తనతో హింసించకు. చిన్నపిల్లల మనస్తత్వాల మీద ఇలాంటివి ఎలా ప్రతిబింబిస్తాయో నేను కొత్తగా చెప్పనక్కరలేదు. ఎవరూ చేయని తప్పుకు వాళ్ళని నీ ప్రవర్తనతో బాధపెట్టడం న్యాయంకాదు. అలా అన్ని సంఘటనలు ఒక్కసారిగా తీసుకొచ్చిన విధిది తప్పు. మీ ఇంట్లో ఎవరిదీ కాదు. అపాలజీ చెప్పినప్పుడయినా రాజేష్‌తో నువ్వు మాట్లాడి వుండాల్సింది.''

పిల్లవాడి కాలికి దెబ్బ తగిలితే తినడానికి చక్కెర ఇచ్చి ఏడుపు మానిపించగలగడం, ఆ గాయం మీద చక్కెర పొడివేసి నొప్పి తగ్గిందని బ్రెయిన్ వాష్ చేయడం, ఆ పిల్లవాడి దృష్టి, ఆలోచన ఆ దెబ్బమీంచి తాత్కాలికంగా మళ్ళించడానికే.''

ప్రొఫెసర్ మేల్‌కోటే కూడా దాదాపుగా ఇదే టెక్నిక్‌ని నీరజమీద ప్రయోగించాడు. ఆమె మనసులోని బాధనుంచి ఆలోచనలని మరోవైపు, ఆమె అంతదాకా ఆలోచించని మరో మార్గానికి మళ్ళించాడు. ఆ కన్‌స్ట్రక్టివ్ థింకింగ్ నీరజ మనసుకి పట్టింది.

మేల్‌కోటే నుంచి ఆమె సెలవు తీసుకునేటప్పుడు యిదివరకంత తీవ్రంగా లేదు ఆమె మనసులోని బాధ.

బాధ కప్పేయకుండా మామూలుగా ఆలోచించగలగటంతో ఆమెకి గుర్తొచ్చింది. ఉదయం రాజేష్ కట్టు మార్పించటం మరచిపోవటం జరిగిందని.

ఇంటికి వెళ్ళగానే రాజేష్‌ని హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలనుకుంది.

24

సాంబశివరావు అందరికన్నా ముందువెళ్ళి కూర్చున్నాడు తన సీట్లో. తన సెక్షన్‌లో ఎవరూ గతరాత్రి ప్రసక్తి తీసుకురాలేదు. అంతా ఏం జరగనట్లే వున్నారు.

ఆ రోజు టిఫిన్ తిన్నాక ఆఫీస్ కాంటిన్‌కి వెళ్ళలేదు రోజులాగా. రిక్రియేష క్లబ్ సెక్రటరీ సాంబశివరావుకి విచిత్ర వేషధారరణలో వచ్చిన బహుమతి స్వయంగా తీసుకొచ్చి ఇచ్చాడు.

''థాంక్స్'' పొడిగా చెప్పాడు సాంబశివరావు.

''రాత్రి నాలుగుసార్లు పిలిచాం మీ పేరు. రాలేదే?'' అడిగాడు.

''వెంటనే వెళ్ళిపోయాను.''

ఏమైనా చెప్తాడేమో అని కొద్దిసేపు ఎదురు చూశాడు. సాంబశివరావు ముభావంగా వుండటంతో వెళ్ళిపోయాడతను.

మధ్యాహ్నం టెలిగ్రాం వచ్చింది. దాన్ని చింపి చదివాడు. అది చదవగానే సాంబశివరావుకి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లయింది. మనసులోని చికాకు తగ్గి కొద్దిపాటి సంతోషం, సమానంగా బాధ చోటు చేసుకున్నాయి.

మడిచి ఆ టెలిగ్రాం కాగితాన్ని జాగ్రత్తగా జేబులో పెట్టుకుని తన ఆఫీసర్‌తో చెప్పాడు. ''ఇవాళ రెండు గంటలు పర్మిషన్ కావాలి.''

"అలాగే" చెప్పాడాయన.

లైబ్రరీలో కూర్చుని, ఓ పుస్తకంలోంచి నోట్స్ రాసుకుంటున్న నీరజ తన పక్కనే ఎవరో వచ్చి కూర్చోవటం గమనించి చూసింది.

సాంబశివరావు.

"ఏమిటిలా వచ్చారు?" ఆశ్చర్యంగా అడిగింది నెమ్మదిగా.

సాంబశివరావు తనకి బ్యాంక్ చిరునామాకి వచ్చిన టెలిగ్రాంని జేబులోంచి తీసి, బల్లమీద పెట్టి ఆమెవేపు తోశాడు.

నీరజ దాన్నందుకుని ముందర చిరునామాని చదివింది. తర్వాత మెసేజ్ చదివింది.

*బెంగుళూర్*

*29-7-84*

"రాజేష్ నా కొడుకు. 'పల్లకి' వారపత్రికలో రాజేష్ ఫోటో చూసి ఆ ఉత్తరం ఇప్పుడే చదివి ఇది పంపుతున్నాను. రాజేష్‌కి ఎలా వుంది? ఏం ఆపరేషన్? ఇంకా హాస్పటల్‌లోనే వున్నాడా? ఇది అందగానే, దయచేసి రాజేష్‌ని బెంగుళూరులోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాన్సర్‌కి తీసుకురండి. నాకు వాడిని చూడాలని వుంది. నాలుగైదు రోజుల్లో తీసుకురాకపోతే యిక ఎప్పటికీ వాడిని చూడలేననుకుంటాను. నా ప్రేమని రాజేష్‌కి తెలియచేయండి.

**... సావిత్రి.**

సాంబశివరావు ఏదో చెప్పబోయాడు. కానీ నీరజ లేచి బయటకి రమ్మన్నట్లుగా సంజ్ఞ చేసింది.

"నిజంగా నాకు సావిత్రి తెలియదు" చెప్పాడు సాంబశివరావు.

"ముందర ఇంటికి పదండి" చెప్పింది నీరజ.

టెలిగ్రాం చదివిన దశరథరామయ్యకి నిద్రమత్తు పూర్తిగా వదిలింది. మనసు కీడు శంకించింది. సావిత్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాన్సర్‌లో ఎందుకున్నట్లు?

అమ్మ దగ్గరికి తీసుకుని వెళుతున్నట్లు రాజేష్‌కి చెప్పాలనుకున్నాడు. హాల్లో లేడు రాజేష్.

"రాజేష్" పిలిచాడు.

పలకలేదు.

వంటగదిలో, బాత్‌రూంలో, ఇంటి వెనక పెరడులో, కొడుకు, కోడలు గదిలో చూశాడు, ఎక్కడా లేడు.

బన్నీతో ఆడుకుంటున్నాడేమోనని ఆ అమ్మాయిని పిలిచాడు. లేడు.

"ఎక్కడికి వెళ్ళాడు?" విసుక్కున్నాడు.

తర్వాత బయట స్కూటర్ ఆగింది.

సాంబశివరావు, నీరజ లోపలికి వచ్చారు.

"ఈ టెలిగ్రాం చూడు" కొడుక్కి అందించాడు దశరథరామయ్య ఆదుర్దాగా. భార్యాభర్తలిద్దరూ దాన్ని చదివారు. అదే మెసేజ్. బాంక్‌కి వచ్చిన టెలిగ్రాం లాంటిదే

"అయితే రాజేష్‌ని తీసుకుని బెంగుళూరు వెళ్ళాలి" చెప్పాడు సాంబశివరావు.

"ఏడీ రాజేష్?" అడిగింది నీరజ.

"ఆడుకోడానికి వెళ్ళినట్లున్నాడు."

మరో గంటసేపు చూశారు కానీ రాలేదు.

"ఇంతసేపు ఆడుకోడానికి ఎప్పుడయినా వెళ్ళాడా?"

"లేదు"

నీరజకి అనుమానం వచ్చి, అలమార తలుపు తెరిచి చూసింది. వెంటనే చిన్న కేక వేసింది. అందులో రాజేష్ పెట్టి, సంచి, టింకూ వుండే కార్డుబోర్డ్ కార్టన్ లేవు.

భర్త మొహంలోకి చూసింది. సాంబశివరావు మొహంలో భయం స్పష్టంగా కనిపించింది.

ఇల్లంతా వెతికారు. సామాను ఎక్కడా లేదు. వంటగదిలో స్టవ్ ప్రక్కనే ఓ గిన్నె కింద వున్న కాగితాన్ని సాంబశివరావు చూశాడు. దానిమీద 'తాతయ్యకి' అని రాసివుంది.

మడత విప్పి చదివాడు.

రాజేష్ చేతివ్రాతతో రాసి వున్న వాక్యాలని గబగబా చదివాడు.

**"ఎందుకు సృష్టిస్తావ్ దేముడా?**
**మంచి వాసనేసే గంథం చెట్టు నిచ్చిన నువ్వే**
**చేదుపుట్టే వేపచెట్టు నెందుకిచ్చావ్?**
**నన్ను ప్రేమించే అమ్మ నిచ్చిన నువ్వే**
**వీడు నా కొడుకు కాదనే నాన్న నెందుకిచ్చావ్?**
**నేనక్కర్లేని ఈ మనుషుల లోకమునుంచి**
**నీ దగ్గరకు ఎందుకు పిలిపించవ్?"**

ఆ గేయం మీద అక్కడక్కడా పడ్డ కన్నీటి చుక్కలని ఆవేదనగా తన చేతితో తడిమాడు సాంబశివరావు.

"నాదీ తప్పు. ఉదయం సారీ చెప్పినా మాట్లాడని నాది తప్పు. వాణ్ణి గాయపరచి, ఈ స్థితికి తెచ్చిన నాదండి తప్పు. దిగులేస్తే శ్రీరామ, శ్రీరామ శ్రీరామ అనుకోరా అని చెప్పి పంపింది వాళ్ళమ్మ. లేదా గేయాలు పాడుకోమంది. అవేమీ ఆపలేని గాయం తగిలింది వాడి లేత గుండెకి."

నీరజ మొహాన్ని చేతులతో కప్పుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

దశరథరామయ్య ఆదుర్దాగా చెప్పాడు "ఏ అఘాయిత్యం చేయకముందే రాజేష్‌ని వెదికి పట్టుకోవాలి. కట్టుకూడా మార్చుకోలేదు, వాడి ఒళ్ళు కాలిపోతోంది" చెప్పాడు.

25

"ఎక్కడికి వెళ్ళివుంటాడు?" అడిగాడు సాంబశివరావు ఆలోచనగా.

అందరూ తలోదిక్కూ బయల్దేరారు రాజేష్‌ని వెదకడానికి. అందరి గుండెలు దడదడలాడుతున్నాయి. రాజేష్ కనబడితేకానీ వాళ్ళ ఆదుర్దా తగ్గదు.

సాంబశివరావు తన మిత్రుడు పంచాక్షరరావు యింటికి వెళ్ళి చెప్పాడు.

"కొద్దిగా పనుంది. బయటకెళదాం పద."

సాంబశివరావు మొహం చూడగానే ఏదో అయిందని గ్రహించిన పంచాక్షరరావు అడిగాడు.

"ఏమైంది?"

"రాజేష్ కనబడటంలేదు."

"ఏమయ్యాడు?"

"ఇంట్లోంచి పారిపోయాడు."

"అరెరె"

"ఎక్కడికి వెళ్ళివుండచ్చు?"

"అది తెలిస్తే అదృష్టవంతులమే"

నీరజ బన్ని యింటికి వెళ్ళి మరోసారి అడిగింది ఆ పిల్లని.

"రాజేష్ ఎక్కడికి వెళుతున్నాడో నీకు నిజంగా చెప్పి వెళ్ళలేదా?"

"లేదు ఆంటీ"

లలితా నగర్ వీధులన్నీ తిరిగి చూసింది. రామ్‌నగర్ చౌరస్తాకి వెళ్ళి అక్కడున్న రిక్షావాళ్ళని, ఆటో రిక్షా డ్రయివర్‌లని అడిగింది, ఏడేళ్ళ కుర్రాడు అంతకుముందు వాళ్ళ బళ్ళల్లో ఎక్కడికయినా వెళ్ళాడా అని. వెళ్ళలేదు - వెళ్ళటం వాళ్ళు చూడలేదు.

డాక్టర్ హసన్ హాస్పిటల్‌కి వెళ్ళింది, జ్వరంగా వుండటం చేత ఆయన దగ్గరికి మందుకోసం వచ్చాడేమోనని.

రాలేదు.

ఆ చుట్టుపక్కలున్న అన్ని క్లినిక్స్, నర్సింగ్ హోమ్స్, హాస్పిటల్స్‌కి వెళ్ళి అడిగింది జ్వరంతో వున్న ఏడేళ్ళ కుర్రాడు మందులకోసం వచ్చాడేమోనని.

రాలేదు.

ఇంకా ఎక్కడ వెదకాలో తోచలేదు. ఇంటికి తిరిగి వచ్చేసింది. దశరథరామయ్య యింకా తిరిగి రాలేదు. స్కూటర్ మీద అరగంటసేపు రోడ్లన్నీ తిరిగిన సాంబశివరావు పంచాక్షరరావుతో తిరిగి వచ్చాడు.

"పోలీస్ రిపోర్ట్ ఇవ్వండి ముందు" చెప్పింది.

సాంబశివరావు పంచాక్షరావుతో చెప్పాడు.

"నేను పోలీస్ రిపోర్టు యిచ్చి రైల్వే స్టేషన్‌కి వెళతాను. నువ్వు బస్ డిపోకి వెళ్ళి చూడు. కనపడకపోయినా, ఏడేళ్ళ కుర్రాడు విజయవాడకి యింతకుముందు వెళ్ళాడేమో కనుక్కో"

"నేను సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళి చూడనా?" అడిగింది నీరజ.

"వెళ్దాం పద."

"ఫోటోలేదా?" అడిగాడు ఎస్.ఐ

"లేదు."

"ఎలా వుంటాడు?"

రాజేష్ వర్ణనని, ఆ కుర్రాడి వెంట గల సామాను వివరాలని రాసుకున్నాడు.

"అన్ని పోలీస్ స్టేషన్‌లలో సర్క్యులేట్ చేస్తాం ఈ సమాచారం. తెలియగానే కబురు చేస్తాను" చెప్పాడు.

అతని వాలకాన్ని బట్టి చూస్తే రాజేష్ వాళ్ళవల్ల దొరకడనిపించింది దంపతులిద్దరికీ. పోలీస్ స్టేషన్ నించి సరాసరి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి వెళ్ళారు. విజయవాడ వెళ్ళే రైలు మర్నాడు ఉదయం దాకా లేదు. స్టేషనులో ప్రతీ అంగుళం, బాత్‌రూంలు, ప్లాట్‌ఫాంలోని రైల్వే ఆఫీస్ గదులతో సహా చూశారు. పోర్టర్లని అడిగారు. బిచ్చగాళ్ళని అడిగారు. ఎవరూ రాజేష్‌ని చూసినట్లు చెప్పలేదు. మధ్యాహ్నం వెళ్ళిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో వెళితే వెళ్ళి వుండచ్చు. అక్కడినించి సరాసరి టెలిగ్రాఫిక్ ఆఫీసుకి వెళ్ళారు. ఎస్.టి.డి.లో సహజ వుండే వర్కింగ్ విమెన్స్ హాస్టల్‌కి ఫోన్ చేసింది. సహజ లైన్‌లోకి రాగానే చెప్పింది.

హైదరాబాద్ నించి నీరజని. చిన్న సహాయం చేయాలి. ఇక్కడ నించి విజయవాడకి గోల్కొండ ఎక్స్‌ప్రెస్ కాసేపట్లో వస్తుంది. మీ వార్డెన్ పర్మిషన్ తీసుకుని, స్టేషన్‌కి వెళ్ళి రైల్లో రాజేష్ వచ్చాడేమో చూడాలి వస్తే వాడ్ని నీతో తీసుకెళ్ళి నాకు టెలిగ్రాం పంపించు. రాకపోయినా ఆ సంగతి నాకు ఇవాళ రాత్రే టెలిగ్రాం పంపు.''

''ఏమైంది?'' నీరజ కంఠంలోని బాధని గుర్తించి అడిగింది సహజ.

''జ్వరంతో ఇంట్లోంచి పారిపోయాడు. నేను అనుకోవటం వాళ్ళమ్మ దగ్గరకి వెళ్ళివుండాలి. లేదా విజయవాడ వాళ్ళ ఇంటి వాళ్ళింటికి వెళ్ళుండాలి. వస్తే ఆ రైల్లోనే వస్తాడు. మర్చిపోవద్దు.''

''తప్పకుండా ఆ రైల్లో వచ్చే పక్షంలో ఎక్కడికీ పోడు.

''టెలిగ్రాం ఇవ్వడం మర్చిపోవద్దు.''

సహజ ఫోన్ పెట్టేసి వార్డెన్‌కి జరిగింది చెప్పింది. తనొక్కతే అయితే రాజేష్‌ని మిస్ అయ్యే అవకాశం ఉందని, ఆ కుర్రాడిని చూసిన అమ్మాయిలు ఇద్దరిని కూడా తీసుకువెళతానని అడిగింది.

రాజేష్ యింకా గుర్తున్న వార్డెన్ వెంటనే ఒప్పుకుంది.

టెలిగ్రాఫిక్ ఆఫీస్ నుంచి సాంబశివరావు, నీరజ సికింద్రాబాద్ నర్సింగ్ హోమ్‌కి వెళ్ళారు. డ్యూటీలో వున్న సిస్టర్స్, ఆయాలు, డాక్టర్లు బాగా పరిచయమైనవారే. ఆ హాస్పిటల్‌కి కూడా రాజేష్ రాలేదు. వస్తే ఎక్కడికీ పంపకుండా వుంచేస్తామని వాళ్ళు హామీ యిచ్చారు.

''డామిట్! ఎక్కడికి వెళ్ళాడో వీడు?'' చెప్పాడు సాంబశివరావు స్కూటర్ స్టార్టు చేస్తూ.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in